క్లుప్తంగా

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ శంకర్

నరసన్నపేట: స్థానిక మేజరు పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో పలు రహదారులను అభివృద్ధి చేస్తున్నామని సర్పంచ్ బూరల్లి శంకర్ తెలిపారు. ఇప్పటికే 15 రహదారులను అభివృద్ధి చేశామన్నారు. శ్రీరాంనగర్‌లో రూ.3 లక్షలతో రోడ్డు పనులను ఆదివారం ప్రారంభించారు. వార్డు సభ్యుడు కేసీహెచ్‌బీ గుప్త, స్థానిక ప్రతినిధులు రాంజీ, నేతింటి సింహాచలం, ముద్దాడ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సంఘం బలోపేతానికి కృషి



మట్టి వినాయక విగ్రహాలతో సంఘం సభ్యులు

పొందూరు: మండల తెలగ సంక్షేమ సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సంఘం అధ్యక్షుడు పాయక రామారావు, మహిళా అధ్యక్షురాలు పసుపురెడ్డి లక్ష్మీకుమారి అన్నారు. స్థానిక తెలగ సంక్షేమ సంఘం భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో వీరు మాట్లాడారు. సంఘంలోని పేదవారిని, ఆరోగ్య సమస్యలున్న వారిని ఆదుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్ణయించారు. పలు అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం కోలా ఉమ, లక్ష్మణరావు దంపతులు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పిట్టా నారాయణరావు, గంటా శ్రీనివాసరావు, వెంకట నరసింహమూర్తి, భాస్కరరావు, సాయిరాం, కమలాకరరావు, బత్తుల లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న సంఘం సభ్యులు, యువకులు

ఆమదాలవలస: ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారికి ప్రాణ దాతలు కావాలని ఆమదాలవలస మున్సిపల్ కమిషనర్ టి.రవి అన్నారు. సిక్కోలు చేయూత సేవా సంఘం 8వ వార్షికోత్సవం సందర్భంగా పట్టణంలో రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. స్థానిక లక్ష్మీనగర్ ఉన్నత పాఠశాలలో న్యూ బ్లడ్ బ్యాంక్ శ్రీకాకుళం వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రారంభించారు. 40 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పి.వి.రమణమ్మ, సిక్కోలు చేయూత సేవా సంఘం అధ్యక్షుడు గోపి కృష్ణ, కార్యదర్శి వి.టి.నాయుడు, గౌరవాధ్యక్షుడు గుడ్ల బాబు, గౌరవ సలహాదారుడు ఎస్.వి.రమణ, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


150 మందికి వైద్య పరీక్షలు



మందులు పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

ఆమదాలవలస: వర్షా కాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు పి.తాతయ్యలు, కె.హేమంత్,ఎ.వి.పద్మజ అన్నారు. సత్యసాయి సేవా సమితి మెట్టక్కివలస వారి ఆధ్వర్యంలో పాత ఆమదాలవలస సత్యసాయి మందిరం ప్రాంగణంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, సమితి కన్వీనర్ కన్నేపల్లి వెంకట కామావధానులు ప్రారంభించారు. 150 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు డి.సురేష్, పప్పల సౌజన్య సేవలు అందించారు. జిల్లా సేవాదళ్ సమన్వయకర్త పప్పల నాగేశ్వరరావు, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి బోయిన నర్సింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో భక్తిభావం పెరగాలి



ప్రవచనాలు చెబుతున్న లక్ష్మణరావు

సారవకోట: ప్రజల్లో భక్తిభావం పెరగాలని ఒడిశాలోని కాశీనగర్‌కు చెందిన ప్రవచనకర్త లక్ష్మణరావు అన్నారు. మండలంలోని బుడితి గ్రామంలో ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం, దివ్య జీవన సమాజం ఆధ్వర్యంలో ఆదివారం 109వ ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజల్లో భక్తిభావం పెరిగినప్పుడు ఈర్ష్యా, ద్వేషాలు తగ్గుతాయన్నారు. దీని వలన సామాజిక అభివృద్ధి జరుగుతుందన్నారు. రామకోటి, సోమేశ్వరరావు తదితరులు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మోహన్‌రావు, మెండ సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

వంశధార నదీ గర్భం.. ఆక్రమణ



శ్రీముఖలింగం వద్ద సాగు చేస్తున్న మొక్కజొన్న



శ్రీముఖలింగంలో దేవాలయం వెనక ఉన్న వరి పొలాలు

- మొక్కజొన్న, వరి, జీడిమామిడి పంటల సాగు
- ఏటా కోసుకుపోతున్న నదీతీరం
- వర్షా కాలంలో భయం గుప్పెట్లో తీరప్రాంత గ్రామాలు
- నదిలో ఎక్కడకక్కడ యంత్రాలతో ఇసుక తవ్వకాలు

జలుమూరు:

వంశధార నదీ తీరం ఆక్రమణలకు ఏటా గురవుతోంది. మండలంలోని శివారు ప్రాంతమైన కరకవలస నుంచి ఉప్పరపేట వరకు సుమారు 20 గ్రామాల పరిధిలో నదీ గర్భాన్ని ఆక్రమణలు చేస్తున్నారు. నదీ సమీపంలో కొంతమంది రైతులకు జిరాయితీ ఉండడంతో వందల ఎకరాలు ఆక్రమణలు చేస్తున్నారు. మొక్కజొన్న, వరి, జీడిమామిడి, తదితర పంటలను సాగుచేస్తున్నారు. ఇదే అదునుగా ఇసుకాసురులు కూడా యథేచ్ఛగా యంత్రాలతో తవ్వకాలు చేస్తున్నారు. దీంతో వర్షాకాలం వస్తే చాలు కంటి మీద కునుకు లేకుండా నదీ తీర గ్రామాల ప్రజలు భయం గుప్పెట్లో కాలం వెళ్లదీస్తున్నారు.

ప్రతీ ఏటా నష్టమే..

ప్రతీ ఏటా ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు నదీ ప్రవాహం ఎక్కువైతే లోతట్టు ప్రాంతాలైన ఉప్పరపేట, రామకృష్ణాపురం, గొల్లపేట, పర్లాం, అంధవరం, ఉడకలపేట, మాకివలస తదితర గ్రామాల వద్ద కరకట్టలకు గండ్లు పడి గ్రామాల్లోకి వరద నీరు చేరుతుంది. పంట పొలాలు సైతం నీట మునిగి పంటకు నష్టం కలుగుతుంది. ఆక్రమణలు, ఇసుక తవ్వకాల వల్ల కరకట్టలు బలహీనపడి వరదనీరు గ్రామాల్లోకి వచ్చే ప్రమాదముంది. నదీ గర్భంలో లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను తరలించడంతో నదిలో గోతులు ఏర్పడి నీటి ప్రవాహం తీర గ్రామాల వైపు ప్రవహిస్తోంది. దీంతో నది ఒడ్డు కోసుకుపోతోంది.

దేవాలయ భూముల్లో తవ్వకాలు

వంశధార తీర గ్రామాలైన పర్లాం, రామకష్ణాపురం, అంధవరం, గొల్లపేట, తదితర గ్రామాల్లో నరసన్నపేట వేంకటేశ్వర ఆలయ భూములు సుమారు 240 ఎకరాల వరకు ఉన్నాయి. వీటిలో ఇసుక అక్రమ తవ్వకాలతోపాటు విలువైన జీడిమామిడి, సరుగుడు, నీలగిరి, టేకు, తదితర చెట్లను నిబంధనలకు విరుద్ధంగా నరికివేసి విక్రయిస్తున్నారు. వీటిని అరికట్టాల్సిన దేవదాయ, రెవెన్యూశాఖ అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్షాకాలంలో నది లోపలి వరకు జీడిమామిడి మొక్కలు వేసి ఆక్రమించేస్తున్నారు. వేసవిలో యంత్రాలతో నదీ గర్భాన్ని చదునుచేసి వరి, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేస్తున్నారు. దేవాలయ భూముల్లో చెట్లు నరికివేతపై కనీసం అటవీశాఖ అధికారులు తనిఖీలు చేయడం లేదు. సంబంధిత అధికారులు కూడా చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి



నది ఒడ్డునే ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. అధికారులు పర్యవేక్షించి తవ్వకాలను అడ్డుకోవాలి. ఏటా ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. దీంతో నది స్వరూపమే మారిపోతుంది. వర్షాకాలం వస్తే చాలు భయంతో గడుపుతున్నాం.

– కె.నాగరాజు, రైతు, పర్లాం, జలుమూరు మండలం

ఇళ్లలోకి నీరు వస్తోంది



ఇసుక తవ్వకాలు, నదీ గర్భం ఆక్రమణల వల్ల ఏటా ఇళ్లలోకి నీరు వస్తోంది. గట్టును సైతం తవ్వకాలు చేస్తున్నారు. దీనిపై పాలకులు చర్యలు తీసుకోవాలి.

– అంధవరపు రాము, అంధవరం, జలుమూరు మండలం

చర్యలు తీసుకుంటాం

నది ఆక్రమణలకు సంబంధించి పరిశీలన చేసి రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమిని గుర్తించి ఆక్రమణలను అడ్డుకుంటాం. సంబంధిత రైతులకు నోటీసులు జారీ చేస్తాం. దేవాలయ భూముల్లో చెట్లు నరికివేతపై దృష్టి పెట్టి ప్రభుత్వ భూములను రక్షిస్తాం. అటవీశాఖ సమన్వయంతో చర్యలు తీసుకుంటాం.

– జెన్ని రామారావు, తహసీల్దార్, జలుమూరు

మట్టి విగ్రహాల పంపిణీ



హిరమండలం: మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న సాయికృష్ణ పట్నాయక్



నరసన్నపేట: మారుతీనగర్‌లో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న జేబీటీ స్కూల్ ప్రతినిధులు

హిరమండలం: మేజర్ పంచాయతీలోని చిన్నకోరాడ జంక్షన్ వద్ద 3 వేల మట్టి వినాయక విగ్రహాలతోపాటు వినాయక వ్రతం పుస్తకాలను నందిగాం సాయికృష్ణ పట్నాయక్ ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాయికృష్ణ పట్నాయక్ మాట్లాడుతూ ప్రతి ఏటా మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు తూలుగు తిరుపతిరావు, డి.ఢిల్లేశ్వరరావు, పి.శ్రీధర్, తట్ల శంకరరావు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మారుతీనగర్‌లో..

నరసన్నపేట: పర్యావరణ హితం కోరి సారవకోట మండలంలోని అవలింగికి చెందిన జేబీటీ ప్రైవేట్ స్కూల్ యాజమాన్య ప్రతినిధులు, విద్యార్థులు కలిసి ఆదివారం నరసన్నపేట పట్టణంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ప్రతి ఏటా ఈ విధంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తూ తమ వంతుగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నామని, ప్రజలు కూడా మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని స్కూల్ యాజమాన్య ప్రతినిధి మోహన్ గాంధీ తెలిపారు. వెయ్యి విగ్రహాలను నరసన్నపేటతోపాటు పరిసర గ్రామాల్లో పంపిణీ చేశామన్నారు. ప్రతి ఏటా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు జామి రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం జిల్లాలోనే కొనసాగించాలి



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలాన్ని శ్రీకాకుళం జిల్లాలోనే కొనసాగించేలా ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీలకు చెందిన నాయకులు కలిసి కట్టుగా పని చేయాలని వైఎస్సార్‌సీపీ, టీడీపీకి చెందిన నాయకులు, పలువురు ఉద్యోగులు కూటమి ప్రభుత్వాన్ని కోరారు. మోదుగువలస గ్రామంలోని ఆలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. ఎల్.ఎన్.పేట మండలాన్ని శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌లో చేర్చి, శ్రీకాకుళం జిల్లాలోనే కొనసాగించాలన్నారు. మండల ప్రజల అభిమతానికి అనుగుణంగా జిల్లాకు చెందిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పాతపట్నం ఎమ్మెల్యే కలిసి కూటమి ప్రభుత్వాన్ని ఒప్పించాలన్నారు. దీని కోసం మండలంలోని నాయకులంతా రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని సభకు హాజరైన వారంతా ఆమోదం తెలిపారు. పలాసను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయనుండటంతో అందులో ఎల్.ఎన్.పేట మండలాన్ని చేర్చడం ప్రజల మనోభావాలకు విరుద్ధమన్నారు. భౌగోళికంగా, రవాణాపరంగా సదూరంగా ఉందన్నారు.

పాతపట్నంలో విలీనం చేయాలి

పాతపట్నం: కొత్తూరు మండలంలోని జగన్నాథపురం గ్రామాన్ని పాతపట్నం మండలంలో విలీనం చేయాలని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మిరియబిల్లి శ్యామ్‌సుందరరావు, జగన్నాథపురం గ్రామస్తులు కోరారు. ఆదివారం జగన్నాథపురంలో సమావేశం నిర్వహించారు. కొత్తూరు మండల కేంద్రానికి వెళ్లాలంటే ఒడిశా రాష్ట్రం మీదుగా వెళ్లాల్సి వస్తోందని, సుమారు 30 కిలో మీటర్ల దూరం ఉంటుందన్నారు. తమ గ్రామ రెవెన్యూ పరిధి పాతపట్నం మండలంలో ఉందని, అందువల్ల పాతపట్నం మండలంలో విలీనం చేయాలన్నారు. పాతపట్నం మండల కేంద్రం ఆరు కిలో మీటర్ల దూరం మాత్రమే ఉంటుందన్నారు. కొత్తూరు మండలానికి వెళ్లి, రావాలంటే ఒక రోజు పడుతోందన్నారు. అధికారులు స్పందించి పాతపట్నం మండలంలో విలీనం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



నరసన్నపేట: ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

నరసన్నపేట/జలుమూరు: నరసన్నపేట, జలుమూరు మండల కేంద్రాల్లోని ఎరువుల దుకాణాలను విజిలెన్స్ సీఐ సతీష్‌కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ చల్ల ఎర్రన్నాయుడు ఆదివారం తనిఖీ చేశారు. నరసన్నపేటలో మూడు, జలుమూరులో రెండు షాపుల్లో ఎరువుల విక్రయాలు, యూరియా అమ్మకాలు, స్టాక్, తదితర రికార్డులను పరిశీలించారు. నరసన్నపేటలోని మూడు షాపుల్లోనూ యూరియా నిల్వలు లేకపోవడంతో ఇతర ఎరువులకు సంబంధించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ నరసన్నపేట ఏడీ ఎల్.వి.మధు మాట్లాడుతూ.. ఎరువులు కొనుగోలు చేసిన రైతుల నుంచి సంతకాలు తీసుకోవాలని, రసీదులు ఇవ్వాలన్నారు. తనిఖీల్లో నరసన్నపేట ఏఓ సూర్యకుమారి, జలుమూరు ఏఓ కింజరాపు రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇదేనా స్వచ్ఛత?



నివగాంలో మురుగు కాలువలో పేరుకుపోయిన పూడిక



సిరుసువాడ పాఠశాలకు ఆనుకొని ఉన్న ఎస్సీ వీధిలో మురుగునీటి కాలువ దుస్థితి ఇలా..

- కంపుగొడుతున్న గ్రామాలు
- కానరాని పారిశుద్ధ్య పనులు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

కొత్తూరు: స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర పేరుతో కూటమి ప్రభుత్వం ప్రతీ నెలలో ఒక శనివారం చేస్తున్న హడావిడి అంతాఇంతా కాదు. కానీ క్షేత్ర స్థాయిలో అందుకు భిన్నంగా ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామాలు తడిచి ముద్దయ్యాయి. పారిశుద్ధ్యం లోపించడంతో చాలా గ్రామాలు కంపుగొడుతున్నాయి. మండలంలో 43 గ్రామ పంచాయతీలున్నాయి. కొత్తూరు, పొనుటూరు, మహసింగితోపాటు పలు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మిగిలిన పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో ప్రజలు దుర్వాసతో ఇబ్బంది పడుతున్నారు. ప్రజలు అంటురోగాల బారిన పడకుండా ఉండేందుకు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, బ్లీచింగ్ చల్లించాలని జిల్లాలోని అందరు ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలను పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామాల్లోని రహదారులపై మురుగునీరు ప్రవహిస్తోంది. రోడ్లపై చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించకపోవడంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలు రోగాలు బారినపడుతున్నారు. కనీసం తాగునీటి బోర్లు వద్ద కూడా పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో నీరు కూడా కలుషితమయ్యే ప్రమాదం ఉంది. గ్రామాల్లో పూర్తి స్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నాం..



తుఫాన్ కారణంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా పనులను చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు ఇదివరకే ఆదేశించాం. మురుగునీటి కాలువల్లో బ్లీచింగ్ చల్లించాలని చెప్పడం జరిగింది.

– వసంతకుమారి, ఈఓపీఆర్డీ, కొత్తూరు మండలం

పెంట కుప్పలు తొలగించాలి



ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది. రోడ్డు పక్కన వేసిన పెంట కుప్పలు, చెత్త కుప్పలను వెంటనే తొలగించాలి. పెంట కుప్పల వలన దోమల బెడద ఎక్కువగా ఉంది.

– గార రాజులునాయుడు, మాకవరం, కొత్తూరు మండలం

వంట మనిషిని తొలగించడం అన్యాయం

- వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు తమ్మినేని చిరంజీవినాగ్



మాట్లాడుతున్న తమ్మినేని చిరంజీవినాగ్

ఆమదాలవలస: స్థానిక మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో (గేటు) హెల్పర్ అండ్ కుక్‌గా పనిచేస్తున్న పొట్నూరు వసంతకుమారిని ఉద్దేశపూర్వకంగానే కూటమి నాయకులు తొలగించడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. ఆమదాలవలసలోని స్వగృహంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. గేటు ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అనైతిక విధానాలను ఖండించారు. పాఠశాల అభివృద్ధి కమిటీ తీర్మానం లేకుండా వంట కార్మికురాలను తొలగించటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కమిటీ వైస్ చైర్మన్ సంతకాన్ని ఫోర్జరీ చేశారన్నారు. మేనేజ్‌మెంట్ కమిటీ తీర్మానాన్ని అందించకపోయినప్పటికీ కొంతమంది అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో వంట మనిషిని తొలగించటం అన్యాయమన్నారు. పొట్నూరు వసంత కుమారుని తొలగించి చందనాల అమ్మలును నియమించడంపై కోర్టును ఆశ్రయిస్తామన్నారు. చిరు ఉద్యోగులను తొలగించడంతో వారు జీవనాధారం కోల్పోయి రోడ్డున పడుతున్నారన్నారు. ఇంతవరకు నియోజకవర్గంలో అన్యాయంగా తొలగించిన వంట కార్మికులను తక్షణమే తిరిగి నియమించాలని, లేకుంటే న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే గేటు ప్రాథమిక పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా కార్యక్రమాలు జరుగుతున్నాయని మున్సిపల్ మాజీ వైస్ ఫ్లోర్ లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు అన్నారు.

పశువులకు నిలయంగా..



సారవకోట మండలంలోని అలుదు గ్రామంలో నిర్మించిన సచివాలయ భవనం అసంపూర్తిగా ఉండటంతో పశువుల శాలగా మారింది. గత ప్రభుత్వ హయంలో ఈ గ్రామంలో సచివాలయ భవన నిర్మాణ పనులు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికలు రావడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎటువంటి నిర్మాణ పనులు చేయకపోవడంతో స్థానికులు కొంతమంది ఈ భవనంలో పశువులు కడుతున్నారు.

–సారవకోట

అవస్థలు ..



పాతపట్నం మండలంలోని ప్రహరాజపాలెంలో గల డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ బాలికల గురుకుల పాఠశాల డార్మిటరీ కిటికీ తలుపులు పూర్తిగా పాడయ్యాయి. దీంతో వర్షాలు కురిసే సమయంలో నీరు లోపలికి వెళ్లడంతోపాటు చలితో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల గురుకులంలో 21 మందికి జ్వరాలు రావడంతో అధికారులు స్పందించారు. గురుకులంలోనే వైద్య సేవలు అందించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కిటికీలకు తలుపులు వేయించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

– పాతపట్నం

అధ్వాన దారులు



కిట్టాలపాడు రహదారి దుస్థితి ఇలా..



బొత్తడిసింగి రహదారి గోతుల్లో చేరిన వర్షం నీరు

హిరమండలం: ఇటీవల కురిసిన వర్షాలకు హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల్లో చాలా రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఎల్.ఎన్.పేట మండలంలో బొత్తాడిసింగి, జాడిపేట, కొమ్మవలస, సిద్ధాంతం రహదారులు, హిరమండలం మండలంలో కిట్టాలపాడు, నవగుడ, గొట్టా బ్యారేజీ నుంచి నివగాం వెళ్లే రహదారులు దారుణంగా ఉన్నాయి. ఈ రహదారుల్లో కనీసం నడిచి వెళ్లడానికి కూడా వీళ్లేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారులను బాగుచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

‘వెన్నుపోటుకు కేరాఫ్ చంద్రబాబు’



మెట్టూరు బిట్-2 ఆర్‌ఆర్ కాలనీలో క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తానని సీఎం చంద్రబాబు ఊదరగొట్టారని, అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తయినా హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అన్నారు. మండలంలోని మెట్టూరు బిట్-1, మెట్టూరు బిట్-2 ఆర్‌ఆర్ కాలనీల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోకు సంబంధించిన క్యూ ఆర్ కోడ్‌ను అందించారు. సర్పంచ్ యర్లంకి ధర్మారావు, నక్క వెంకటరావు, ఎంపీటీసీ సభ్యులు వనుము లక్ష్మీనారాయణ, బోర ఆఫీస్, పార్టీ నాయకులు ఎ.లక్ష్మీనారాయణ, బి.రాజేష్, నరసింహ రెడ్డి, మురపాక శంకరరావు, మఠం పూర్ణ, బొమ్మాళి నగేష్, పార్టీ కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.